# మాతృదేవోభవ



— మహర్షి

(భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారి 'చిన్నకథ' జగత్ప్రసిద్ధం. అది అన్ని భాషల వారికి చిన్నకథే. ఆ చిన్నకథలో ఎన్నో, ఎన్నెన్నో భావార్థాలు, గూఢార్థాలు నిక్షిప్తమై వుంటాయి. వాటిని ఆస్వాదించి ఆనందించండి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యోపన్యాసాల నుండి స్వీకరించి రచించిన ఆర్. సీతాలక్ష్మిగారి చిన్నకథ ఆధారముతో ..., మహర్షి).

బర్మాదేశంలోని రంగూన్ పట్టణం రెండో ప్రపంచయుద్ధంలో బాంబులకు గురి అయి సర్వనాశనము అయినది. ఆ పట్టణములోని ప్రజలు ఆస్తిపాస్తులు ధ్వంసమై అనేక కష్టములు అనుభవించారు. అనేక కుటుంబములలో తల్లి బిడ్డకు, బిడ్డకు తల్లికి, భార్యాభర్తకు, భర్త భార్యకు ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా పోయింది.

భర్తకు దూరమైన ఓ ఇల్లాలు తన ఇద్దరి బిడ్డలతో బ్రతికి బయటపడి భారతదేశం చేరుకుని బరంపురం వచ్చినది. పాపం ఆమెకు అయిదు, రెండు సంవత్సరముల వయసు కుమారులు వున్నారు. ఆమెతో పాటు బర్మాదేశం నుండి అనేక కుటుంబముల వారు కాందిశీకులుగా బరంపురం చేరటం చేత, వీరందరికి తినటానికి తిండి దొరకడం కష్టమైనది. అప్పుడు ఈ పిల్లల తల్లి కష్టపడి ప్రతి వీధి తిరిగి భిక్షాటన చేసి దొరికిన దానిని పిల్లలకు పెట్టి, మిగిలిన దానిని తాను తింటూ కాలం గడుపుతూ వచ్చింది. రానురాను భిక్షం కూడా దొరకడం కష్టమైనది. తిండిలేక ఆమె బలహీనురాలై పోయింది. భిక్షమెత్తటానికి కూడా ఆమెకు శక్తి లేకపోయింది.

తల్లియొక్క పరిస్థితిని గమనించిన పెద్ద కుమారుడు "అమ్మా! రేపటి నుండి నీ కుమారుడుగా నేను భిక్షాటన చేస్తాను. నీవు నీరసంతో బయటకు వెళ్లవద్దు" అని బ్రతిమాలాడాడు. ఆ తల్లి కాదన లేకపోయింది. ఆ రోజు నుండి ఆ పిల్లవాడు భిక్షమెత్తి, దొరికిన దానిని తల్లికి, తమ్ముడికి పెట్టి మిగిలినది కొద్దిగా తిని నీళ్ళతో కడుపు నింపుకునేవాడు. తల్లి అడిగితే తిన్నానని అబద్ధం చెప్పేడివాడు.

అలా రోజులు గడుస్తుండగా ఆ పిల్లవాడు నీరసించి బలహీనుడయిపోయాడు. ఒకరోజు భిక్షమెత్తుతూ ఒక శ్రీమంతుని ఇంటిముందు భిక్షాందేహి అని బిగ్గరగా అరచి క్రిందపడిపోయాడు. వాకిట్లో కూర్చుని వున్న శ్రీమంతుడు పరుగెత్తుకువచ్చి ఆ అబ్బాయి తల తన ఒడిలో పెట్టుకుని "బాబూ! నీకు కడుపునిండా అన్నం పెడతాను తిను?" అని అన్నాడు ప్రేమగా.

కానీ ఆ అబ్బాయి హీన స్వరంతో ఏదో చెప్పబోయాడు. శ్రీమంతుడు ఆ అబ్బాయి నోటి దగ్గిర తన చెవిని వుంచి వినటానికి ప్రయత్నించాడు. "అమ్మకు మొదట అన్నం" అని చెప్పి ప్రాణం వదిలాడు. ఆ అబ్బాయి ఆఖరి క్షణం వరకూ తల్లి గురించే ఆలోచించాడు. చిన్న వయసులో కూడా మాతృభక్తి కలిగిన ఆ బాలుడు ధన్యజీవి.

ప్రేమతో, త్యాగభావంతో కని, పెంచిన తల్లిని సంతోష పెట్టడం, ఆమెను సేవించడం ప్రతి ఒక్కరి ప్రధాన కర్తవ్యం! ●

# మ్యారేజ్ డే

వరుడు: వై. నరసింహారావు
వధువు: నాగమణి
వివాహ తేదీ: 26-4-1969
జరిగిన స్థలం: ద్వారక తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామివారి సన్నిధిన.



వరుడు: ఎస్. గంగాధర్
వధువు: సరోజిని,
వివాహతేదీ: 20-3-83
స్థలం: ఇందూరు

